క్లుప్తంగా

3న ఎమ్మెల్యే పర్యటన

కలకడ : ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని కలకడ మండల పార్టీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు కలకడ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో (శ్రీనివాసులురెడ్డి భవనం) పార్టీ కార్యకర్తల సమావేశంలో పీలేరు ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి నాయకులు హాజరు కావాలని కోరారు.

రేపు మెగా జాబ్‌మేళా

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ డిగ్రీ, పీజీ అర్హత కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చునని తెలిపారు. పేటీఎం, బిగ్‌సీ, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, యంగ్ ఇండియా, టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9493212454, 9441900909 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ పంపిణీ



పింఛను అందజేస్తున్న వలంటీరు విజయలక్ష్మీ

పీలేరురూరల్ : తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ లబ్ధిదారుడికి అక్కడికే వెళ్లి పింఛను అందజేసిన గ్రామ వలంటీర్ శభాష్ అనిపించుకున్నారు. పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన వెంకటరమణ అనారోగ్యంతో రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న బండ్ల వంక గ్రామ వలంటీరు విజయలక్ష్మీ ఈ నెల పింఛను రూ.3 వేలు తిరుపతికి వెళ్లి అందజేశారు. వెంకటరమణ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

దొంగల బారి నుంచి కాపాడండి

పెద్దతిప్పసముద్రం : వ్యవసాయ పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న డ్రిప్ పైపులు, కేబుల్ వైర్లు రాత్రి వేళ దోచుకెళ్తున్నారని రాపూరివాండ్లపల్లి పంచాయతీలోని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చేస్తున్నారు. ఆకతాయిలు తాగుడు, జూదాలకు బానిసలై వారి జల్సాల కోసం రైతుల పొలాల్లో పరికరాలను అపహరిస్తూ తమను నిలువునా ముంచుతున్నారని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రాత్రి వేళ నిఘా పెట్టి దొంగల బారి నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

పెద్దతిప్పసముద్రం : స్థానిక మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శివకుమారి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 12న ఐదో తరగతి సిలబస్‌పై విద్యార్థులకు పరీక్ష ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. అర్హత సాధించిన వారిని రిజర్వేషన్ ప్రకారం ఎంపిక చేస్తామని ఆమె వెల్లడించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75ల చొప్పున ప్రవేశ పరీక్షా రుసుం ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన

కలికిరి : మండల సర్వేయర్ తీరుపై భారతీయ అంబేద్కర్ సేనానాయకులు శనివారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మండలంలోని మేడికుర్తి గ్రామానికి చెందిన రైతు ఈశ్వరయ్య తన భూమి ఎఫ్–లైన్ సర్వే కోసం గత నెల 9న దరఖాస్తు చేసుకున్నాడని, సచివాలయ, మండల సర్వేయర్లు స్పందించడం లేదని ఆరోపించారు. స్పందించిన డీటీ సయ్యద్ నిరసనకారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు.

సమన్వయంతో బర్డ్ ఫ్లూ నియంత్రణ

చిట్వేలి : రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఫారెస్టు శాఖల సమన్వయంతో బర్డ్ ఫ్లూ వ్యాధిని నివారించవచ్చని ఉమ్మడి కడప జిల్లా పశువ్యాధుల నిర్ధారణ సహాయ సంచాలకులు, నియంత్రణ నోడల్ అధికారి డాక్టర్ రాజశేఖర్ అన్నారు. శనివారం నెల్లూరు, అన్నమయ్య జిల్లాల సరిహద్దులో అనుంపల్లి వద్దగల ఫారెస్టు, పోలీస్ చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిమాంసం, కోడిగుడ్లను బాగా ఉడికించి తినాలని ప్రజలకు సూచించారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు

లక్కిరెడ్డిపల్లి : విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి షైజు నీషా పేర్కొన్నారు. శనివారం ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.. మెనూ ప్రకారం భోజనం అందరికీ అందిస్తున్నారా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ 2024 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయని, కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

నేడు పల్స్‌పోలియో



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ కీర్తి, వైద్య సిబ్బంది



గర్నిమిట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కురబలకోట : పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కురబలకోట మండల వైద్యాధికారులు కె. శ్రీధర్, క్రిస్టల్ కోరారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ ఆదివారం పోలియో చుక్కలు వేయించాలన్నారు. అందరూ సహకరించాలని కోరారు

విద్యార్థుల ర్యాలీ

వాల్మీకిపురం : మండలంలోని నగరిమడుగులో పిహెచ్‌సి డాక్టర్ కీర్తి ఆధ్వర్యంలో విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కీర్తి మాట్లాడుతూ నేడు జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి 20 బూత్‌లు, రెండు రూట్లు, ఒక్క మొబైల్ వాహనం ఏర్పాటు చేశామన్నారు. మార్చి 3న ఉదయం 7గంటల నుండి సాయంత్ర 5గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అమృత, మౌనిక, పావని, గంగరత్న, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పూర్తి చేయాలి

కలకడ : మండలంలో జరుగుతున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కలకడ, ఎర్రకోటపల్లె వైద్యాధికారులు మల్లికార్జున, కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వందశాతం పోలియో చుక్కలు వేసేందుకు సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. చిన్నారి ఎడమచేతి చిటికెన వేలుకు గోరు తగిలే విధంగా ఇంక్ వ్రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సిబ్బంది సుబ్బరత్నమ్మ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

45 కేంద్రాలు ఏర్పాటు

కేవీపల్లె : పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గర్నిమిట్ట, జిల్లేళ్లమంద, గ్యారంపల్లె పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ రేష్మ, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ పావనగౌరి తెలిపారు. మూడు పీహెచ్‌సీల పరిధిలో 0–5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్నిమిట్ట పీహెచ్‌సీ పరిధిలో 17, జిల్లేళ్లమంద పీహెచ్‌సీ పరిధిలో 17, గ్యారంపల్లె పీహెచ్‌సీ పరిధిలో 11 కేంద్రాల ద్వారా పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అర్చన, సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, పీహెచ్‌ఎన్ రమాదేవి, పర్యవేక్షకులు రుక్మిణి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించుకోవాలని తలపుల, రేగళ్ల వైద్యాధికారులు డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ కార్తీక్‌కుమార్ అన్నారు. రేగళ్ల పీహెచ్‌సీ పరిధిలో 20 కేంద్రాల ద్వారా 4287 మందికి, తలపుల పీహెచ్‌సీ పరిధిలో 22 కేంద్రాలు 3485 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మూడు మొబైల్ టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు పల్స్‌పోలియో

రామసముద్రం : మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో నారాయణస్వామి తెలిపారు. పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలు ప్రతి ఒక్కరూ పోలియో చుక్కలు వేసుకోవాలన్నారు. శనివారం మండల వ్యాప్తంగా వాహనాల ద్వారా ప్రచారం నిర్వహించామని ఎంపీడీవో తెలిపారు.

మున్సిపాలిటీలో బహిరంగ వేలంపాటలు వాయిదా

- పాట పాడేందుకు సుముఖత చూపని పాటదారులు
- 13న మరోసారి వేలం నిర్వహిస్తామన్న కమిషనర్



వేలంపాటలు నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీల

మదనపల్లె : మున్సిపాలిటీకి చెందిన దినసరి మార్కెట్, వారపుసంత, జంతువధశాల, మాంసం మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్‌లో గేట్(ఆశీలు) వసూలు చేసుకునేందుకు కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన బహిరంగ వేలంపాటలు రద్దయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు వేలంపాటలు నిర్వహించారు. దినసరి మార్కెట్, వారపు సంతకు...శిరీషా, సత్తార్ పేర్లతో ఇద్దరు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. దినసరి సంతకు సంబంధించి గత ఏడాది యస్.యాస్మిన్ రూ.1.30 కోట్లకు పాడుకోగా, , ఈ ఏడాది గత మూడేళ్ల సరాసరిని లెక్కించి, రూ.1కోటి9లక్షల17వేలుగా సర్కారు ధర నిర్ణయించి, వేలంపాట ప్రారంభించారు. దీనికి జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. అయితే పాటదారులు జీఎస్టీని మినహాయించి, వేలం ధర తగ్గిస్తే పాట పాడుకునేందుకు తాము సిద్ధమని చెప్పారు. తప్పక చెల్లించాల్సిందేనని, మూడేళ్ల సరాసరి మొత్తం కంటే తగ్గించేందుకు మున్సిపల్ నిబంధనలు అంగీకరించనడంతో దరఖాస్తుదారులు వెనుదిరిగారు. దీంతో ఈనెల 13న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, నిబంధనలకు అనుగుణంగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ఆర్వో నాగేశ్వర్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మదనపల్లె సిటీ : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మదనపల్లె పట్టణంలోని 12 కేంద్రాలకు విద్యార్థులు, తల్లిదండ్రులు చేరుకున్నారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పరీక్షా కేంద్రాల వద్ద హాల్ టిక్కెట్లు ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించారు. ఇంటర్ పరీక్షల ప్రత్యేక అధికారి బాలకృష్ణమూర్తి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

బ్యాంకు పథకాలపై అవగాహన



కళాజాత సభ్యులను అభినందిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ చంద్రశేఖర్

తంబళ్లపల్లె : బ్యాంకు పథకాలపై ప్రజలకు అవగాహన ముఖ్యమని అప్పుడే ఆర్థిక లబ్ధి పొందుతారని ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం కన్నెమడుగు, రేణుమాకులపల్లె వినియోగదారులకు బ్యాంకు పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత సభ్యులు బ్యాంకు పథకాలు, సామాజిక భద్రత బీమా పాలసీలు, జీరో అకౌంట్ నగదు రహిత లావాదేవీలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై ప్రజలకు అర్థమయ్యే విధంగా మాటలు, పాటలు, మ్యాజిక్‌షో ద్వారా వినిపించారు. ఈ కార్యక్రమంలో కళాజాత సభ్యులు వినోద్, చిరంజీవి, మెజీషియన్ విజయ్‌లు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది



ఓటు విలువను విద్యార్థులకు వివరిస్తున్న డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, నిసార్‌అహ్మద్

మదనపల్లె : ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనది... ప్రతి ఒక్కరూ ప్రలోభాలకు గురికాకుండా ఓటును ఆయుధంగా వినియోగించుకున్నప్పుడే దానికి సార్థకత కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఓటు నమోదు, ఓటుహక్కు వినియోగంపై అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ముందుగా ముఖ్య అతిథులు శ్రీనివాస డిగ్రీ కళాశాలల చైర్మన్ ఎన్.కృష్ణారెడ్డి, డైరెక్టర్.ఎన్.శ్రీనివాసులురెడ్డి ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దేశాయ్ తిప్పారెడ్డి, నిసార్ అహ్మద్‌లు మాట్లాడుతూ...దేశంలోని ప్రతి ఒక్కరికీ ఆర్టికల్ 326 ప్రకారం కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాషా భేదాలు లేకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించారన్నారు. సమర్థులైన పాలకులను ఎన్నుకునే అవకాశం ఇచ్చారన్నారు. పోలింగ్ రోజు ఓటరు తీసుకునే నిర్ణయమే, మన ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. యువత బాధ్యతగా కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి, పనిచేసే ప్రజాప్రభుత్వాన్ని ఎన్నుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏ.రెడ్డిశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు లియాఖత్‌అలీ, సోమశేఖర్‌రెడ్డి, కోటూరిఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

పీలేరు : మాదిగ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా శనివారం రాత్రి స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు తమ ప్రాణాలు పణంగా పెట్టి ఉద్యమాలు చేశారన్నారు. మాదిగల అభివృద్ధికి ఎస్సీ వర్గీకరణ ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యర్రయ్య, నరసింహులు, చరణ్‌కుమార్, హుస్సేనయ్య, రమణ, భాస్కర, రెడ్డికుమార్, చందు, అనిల్, రాజశేఖర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్‌లాగే ఓపెన్ స్కూల్ పరీక్షలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ రాఘవరెడ్డి

రాయచోటి టౌన్ : 10వ తరగతి రెగ్యులర్ విద్యార్థుల పరీక్షల నిర్వహించినట్లుగానే ఓపెన్ స్కూల్ 10వ తరగతి పరీక్షలు నిర్వహించాలని ఆర్‌జేడీ యద్దుల రాఘవరెడ్డి అధికారులకు సూచించారు. ఇంటర్ పరీక్షల పర్యవేక్షణలో భాగంగా శనివారం రాయచోటి డైట్ కేంద్రంలో పదవతరగతి పరీక్షల నిర్వహణ, ఓపెన్‌స్కూల్ 10వ తరగతి పరీక్షల నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం రెగ్యులర్ 10వ తరగతి విద్యార్థుల పరీక్షల నిర్వహిస్తామని, అలాగే మధ్యాహ్నం 2–30 గంటల నుంచి ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని అందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అనంతరం డీఈఓ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ కోసం కేటాయించిన కేంద్రాలలో కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై మరోసారి సరి చూసుకోవాలని చెప్పారు. అనంతరం ఓపెన్ స్కూల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ అక్బర్ ఆలీ మాట్లాడుతూ విద్యార్థులకు హాల్ టిక్కెట్‌లో ఏ సబ్జక్టు ఉంటుందో అదే జారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఎం.రవిశంకర్

మదనపల్లె సిటీ : ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని తిరుపతి ఐఐటీ మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఐఐటీ ప్రొఫెసర్లచే డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ అంశంపై సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 3 డి ప్రింటింగ్ మిషన్ల ద్వారా అభివృద్ధి చేయబడిన బయో ఇంప్లాంట్స్ కేస్ స్టడీస్ గురించి వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి, మెకానికల్ హెచ్‌ఓడి భాస్కరన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యకర్తల నిర్ణయమే శిరోధార్యం



మాట్లాడుతున్న చల్లపల్లె నరసింహారెడ్డి

మదనపల్లె : తంబళ్లపల్లె నియోజకవర్గంలోని అభిమానులు, కార్యకర్తల అభీష్టం మేరకే తన రాజకీయ భవిష్యత్తు ఉంటుందని, వారి నిర్ణయమే తనకు శిరోధార్యమని బీజేపీ సీనియర్ జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి అన్నారు. మదనపల్లె సొసైటీకాలనీలోని చల్లపల్లె స్వగృహంలో తంబళ్లపల్లె నియోజకవర్గ అభిమానులు, కార్యకర్తలు శనివారం సమావేశమయ్యారు. బీజేపీ, జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా తంబళ్లపల్లె టికెట్ తెచ్చుకోవాలని, గెలిపించుకునే బాధ్యత తమదేనంటూ చెప్పుకొచ్చారు. లేనిపక్షంలో ఇండిపెండెంట్‌గానైనా పోటీచేయాల్సిందిగా కార్యకర్తలు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. చల్లపల్లె నరసింహారెడ్డి స్పందిస్తూ... ఉమ్మడి రాష్ట్రంలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో బీజేపీకి ఎక్కువ మంది ఎంపీటీసీలు, సర్పంచులు గెలిపించి కంచుకోటగా నిలిపానన్నారు. రాజకీయాలు డబ్బు, కుట్రలు, కుతంత్రాలతో కలుషితమైన నేటిరోజుల్లో... 30 ఏళ్లుగా తన వెంటే నడుస్తూ, కొండంత అభిమానం చూపుతున్న అభిమానులు, కార్యకర్తల ఆశీస్సులే తనకు శ్రీరామరక్ష అన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

శక్తిమాత ఆలయానికి రూ.లక్ష విరాళం



ఆలయ అభివృద్ధికి విరాళం అందిస్తున్న చింతల సాయికృష్ణారెడ్డి

వాల్మీకిపురం : పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలోని శక్తిమాత అమ్మవారి ఆలయ అభివృద్ధికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయి క్రిష్ణారెడ్డి లక్ష రూపాయలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలని, పురాతన ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శంకర, రమేష్, రాజ్‌బాబు, వెంకటస్వామి, రామక్రిష్ణ, గంగిరెడ్డి, వెంకటేశ్వర, గణేష్, ప్రసాద్, గాం. దీపేట రఘు, చిన్న రెడ్డెప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

గడప, గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ములకలచెరువు : రాష్ట్ర ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కదిరినాథునికోట, పెద్దపాళ్యం గ్రామాల్లో ఎమ్మెల్యే శనివారం పర్యటించారు. జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి పనులు, అమలైన సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. పలువురు నుంచి వచ్చిన వినతులను ఆలకించిన ఎమ్మెల్యే తక్షణమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణయుగం కావాలన్నా, పథకాలు కొనసాగాలన్నా వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. కదిరినాథునికోట ఎస్సీ కాలనీలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి తమవంతు సహకారం అందించాలని కాలనీ వాసులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

చెక్కుల పంపిణీ

అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందిన పలువురు బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తమను ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే చొరవతో ముగ్గురు వ్యక్తులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం అందజేశారు. ములకలచెరువు మండలం గూడుపల్లికి చెందిన సుధాకర్ నాయుడుకు రూ.1.10 లక్షలు, దేవలచెరువుకు చెందిన ఎస్.పర్వీన్‌కు రూ.1.40 లక్షలు, పీటీఎం మండలం బూర్లపల్లికి చెందిన నారాయణస్వామికి రూ.5 లక్షల చెక్కులను ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ సాయిలీల, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, కన్వీనర్ మాధవరెడ్డి, సర్పంచులు శంకర్‌రెడ్డి, రాంబాబు నాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీలు క్రిష్ణప్ప, వెంకటరామిరెడ్డి, నాయకులు రవీంద్రారెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఉమా మహేశ్వర్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్లను చూస్తే ప్రతిపక్షాలకు వణుకు



మాట్లాడుతున్న దస్తగిరి

కురబలకోట : సీఎం జగన్ పాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లడంలో గ్రామ వాలంటీర్ల పాత్ర కీలకమని, వారికి ప్రజల ఆదరణ చూసి ప్రతిపక్షాలకు వణుకు పుడుతోందని ఎంపీపీ బి.దస్తగిరి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. జడ్పీటీసీ బైసాని జ్యోతి ఆధ్వర్యంలో శనివారం వాలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డుల ప్రదాన కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ సీఎం జగన్ వద్ద వాలంటీర్లకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. వాలంటీర్లు జీతం తీసుకుని పని చేసేవారు కాదని, గౌరవ వేతనం తీసుకుంటూ దర్జాగా ప్రజాసేవ చేసేవారన్నారు. సీఎం జగన్ అందిస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి వాలంటీర్‌పై ఉందన్నారు. డీఆర్ ఉమాపతిరెడ్డి, భూదేవి, నులక మనోహర్ రెడ్డి, పోరెడ్డి విశ్వారెడ్డి, ఆర్కే కృష్ణారెడ్డి, అంజాద్‌ఖాన్, ఆర్సీ ఈశ్వర్ రెడ్డి, ఈశ్వర్, నాగరత్న, శివశంకర్ రెడ్డి, యాసాస్, ఎంపీడీఓ హరినారాయన్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

కలకడ : కలకడలోని కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శనివారం అంకురార్పణ చేసినట్లు ఆలయ ధర్మకర్త అఖిలేష్ తెలిపారు. ఈ నెల 13వతేదీ వరకూ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. 3న ధ్వజా రోహణం, శేషవాహనం, 4న సోమవారం రావణ వాహనం, 5న మంగళవారం హంసవాహనం, 6న బుధవారం మయూరవాహనంపై స్వామి దర్శనమిస్తారన్నారు. 7న గురువారం కళ్యాణ మహోత్సవం, గజవాహనం, 8న శుక్రవారము మహాశివరాత్రి, శిఖర దీపం, వృషభవాహనం 9న శనివారం రథోత్సవము, యాళి వాహనం, 10న ఆదివారం త్రినేత్ర ధారణ, 11 న సోమవారం వసంతోత్సవం, 12న మంగళవారం పార్వేట, అశ్వవాహనం, 13న బుధవారం ధ్వజావరోహణం, ఊంజల్‌సేవ జరుపుతారన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మహిళల అభివృద్ధికి కృషి



మహిళలతో మాట్లాడుతున్న ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరి

కలికిరి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కృషి చేస్తుందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి అన్నారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో శనివారం ఆయన వచ్చే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం జగన్ మోహన్ రెడ్డి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూర్తి, నూర్‌మహమ్మద్, విజయ్‌కుమార్, కన్యాకుమారి, ఆలియా, ధనలక్ష్మీ, వేమన్న, సతీష్, రహంతుల్లా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.